



# ఇదే ఇక్కడి న్యాయం

-దేవయాని

**సుబ్రహ్మణ్యం** బిక్కుబిక్కుమంటూ పోలీస్ స్టేషన్ గుమ్మంలో అడుగు పెట్టాడు.

ఆ వాతావరణం కాస్త భయం కలిగించింది అతనికి.

అంతకుముందు ఎప్పుడూ అటువంటి చోట అడుగు పెట్టడమే కాకుండా, కనీసం ఒక్కసారైనా పోలీసుతో మాట్లాడి ఎరుగడు సుబ్రహ్మణ్యం.

ఇద్దరు పోలీసులు గుమ్మానికి అడ్డంగా నిలబడి సిగరెట్లు కాలుస్తూ మాట్లాడుకొంటున్నారు. దొంగాడిలా తొంగి తొంగి లోనికి చూస్తున్న సుబ్రహ్మణ్యాన్ని చూసి, 'ఏం పని?' అన్నట్టు కళ్ళెగరేసి ప్రశ్నార్థకంగా చూశాడు ఒక పోలీసు.

"సార్! నా సైకిలు రాత్రి సినిమా హాలు దగ్గర పోయిందండి. బయట పెట్టి టిక్కెట్టు తెచ్చుకునేలోపల ఎవరో కొట్టేశారండీ!" అంటూ ఇంకా ఏదో చెప్పబోతుండగానే, 'లోపలికెళ్ళు' అంటూ కళ్ళతో దారి చూపించాడు అతను సుబ్రహ్మణ్యానికి.

గుటకలు మింగుతూ రెండడుగులు లోపలికి వేశాడు. అక్కడ లావాటి బుర్ర మీసాల పోలీసు మరో లావాటి మనిషితో మాట్లాడుతూ కన్పించాడు. ఇద్దరూ భయంకరంగానే ఉన్నారు. ఆ పోలీసాయనతో మాట్లాడుతున్న మనిషి గడ్డివాములాటి జుట్టుతో, మెళ్ళో తాయెత్తు, గ్లాస్కో లాల్చీ, గళ్ళ లుంగీ! ఇటు తిరిగినప్పుడు బుగ్గమీద కత్తిగాటు కూడా కనిపించింది.

వీళ్ళిద్దరికీ ఇంత స్నేహం ఏమిటా అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. చూసి కూడా చూడనట్టున్న ఆ పోలీసు దగ్గరికి వెళ్ళి వినయంగా నిలబడ్డాడు. ఏమిటన్నట్టు చూశాడతను మాట్లాడటం ఆపి.

"సార్! నా సైకిలు పోయింది, సార్! కంప్లయింటు రాసుకోవాలి." మెల్లగా అన్నాడు.

"నేను కంప్లయింటు రాసుకోవాలా? బుర్రుందా నీ కసలు. నే నెలా కన్పిస్తున్నానయ్యా పైగా ఆర్డ రిస్తున్నా వేటి కత? ఆఁ!"

అతని గద్దింపుతో ఒళ్ళు జలదరించింది సుబ్రహ్మణ్యానికి. "సారీ, సార్-కంప్లయింటు ఇద్దామని వచ్చానండి."

"ఆఁ! సర్లే! నిజంగానే పోయిందా-నాటకాలా?"

"నిజంగా నాదే, సార్! చాలా కష్టపడి డబ్బు కూడబెట్టి, కొంత మా సేఠ్ దగ్గర అప్పు కూడా చేసి కొన్న సైకిలు, సార్. అది. మీ రెలాగయినా నా సైకిలు పట్టుకోవా ల్సార్!" కళ్ళలో నీళ్ళుకూడా తిరిగాయి.

"ఇక చాలావు! పోలీసు డిపార్టుమెంటంతా నీ సైకిలుకోసం వెతక మనేట్టున్నావు. ఈళ్ళకేం పనుల్లే వనుకో గ్గురూ! అయినా, సైకిలే గందా... మరోటి చూస్కునేదానికి ఇరెదాకా రావటం ఏటి, గురూ!" ఉచిత సలహా పారేస్తూ సుబ్రహ్మణ్యాన్ని చూసి నవ్వాడా రౌడీ లాంటి మనిషి.

"సర్లే! అంతోటి తెలివుంటే మందాకా ఎందుకొస్తాడుగానీ... ఇదుగో, బాబూ, ఆ అరుగు మీద టేబిల్దగ్గర రైట్రుంటా డెళ్ళు" అని చెప్పేసి, మళ్ళీ మాటల్లో పడిపోయాడు ఆ పోలీసాయన. ఆ రైటరు కూడా అంత తేలిగ్గా వదల్లేదు సుబ్రహ్మణ్యాన్ని.

"సైకిలు నీదేనని గారంటీ ఏమిటి? నిజంగానే పోయిందా! అంతకు ముందు ఎప్పుడైనా పోయిందా! ఇదే మొదటిసారా? ఇంతకుముందు ఎందుకు పోలేదు? ఇప్పుడే ఎందుకు పోయింది? నీ వెనుక గట్టివా ళ్ళెవరైనా ఉన్నారా?" ఇలా యక్ష ప్రశ్నలు వేసిం తర్వాత వివరాలు రాసుకున్నాడు. కాఫీ ఖర్చులకి ఓ పది పుచ్చుకున్నాక, అప్పుడప్పుడు వచ్చి కనవడమనీ చెప్పి వెళ్ళిరమ్మన్నాడు సుబ్రహ్మణ్యాన్ని.

'బతుకుజీవుడా' అనుకుంటూ బయటపడ్డాడు. గబగబా ఓ ఇరానీ హోటల్‌కి వెళ్ళి వేడివేడి టీ త్రాగి 'హమ్మయ్య' అని నిట్టూర్చాడు. పోలీసులు మనుమల్ని పీడిస్తారని, భయపెడతారని, లంచాలు తినేసి కేసుల రూపురేఖలు మార్చేస్తారని, ఎదురు తిరిగితే కాళ్ళు విరగ్గొడతారని, విరగ్గొట్టిన ఆనమాలు కూడా ఉండదని,ఆడవాళ్ళ నయితే...అమ్మో...తలుచుకోటానికే భయంవేసింది.

పోలీసు వాళ్ళల్లోకూడా మంచివా ళ్ళుంటారని, న్యాయంకోసం నిలబడి పేరుతెచ్చుకున్నవా ళ్ళున్నారని ఎవరైనా నిజం చెప్పినా నమ్మలేని స్థితిలో అతను ఇన్నాళ్ళూ బ్రతికాడు మరి.

ఆ సైకిలు పోకుండా ఉంటే బావుండేదని ఎన్నోసార్లు అనుకున్నాడు. పోతే పోయింది. పోలీసు రిపోర్టు ఇచ్చినా దొరకదని సరిపెట్టుకుందా మనుకున్నాడు రాత్రంతా! ప్రొద్దున్నే షాపుకి వెళ్ళినప్పుడు సేఠ్-"సైకిలు నిజంగా పోయిందట్రా-అమ్ముకున్నావా?" అని నిలవేసినప్పుడు ప్రాణం చచ్చిపోయింది. అందుకే తన నిజాయితీ నిరూపించుకోవాలనే పోలీసు స్టేషన్‌కి వెళ్ళి రిపోర్టు ఇచ్చాడు.

తల్లి, తండ్రి, నాయనమ్మ...ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు-"ఎప్పుడిస్తార్రా సైకిలు" అని చెవుల్లో ఒకటే రొద.

వీళ్ళకేంతెలును పాపం సుబ్రహ్మణ్యం పడుతున్న బాధ. అరగంట ముందే ఉడికీ ఉడకని అన్నం, కూర అవురావురని హడావుడిగా తినేసి, రెండు కిలోమీటర్ల దూరం నడిచి షాపు చేరుకునేసరికి తిన్నది అరిగిపోతూంది. పోస్టాఫీసుకి, బాంకుకి నడిచే వెళ్ళాల్సి వస్తుంది. కాస్త ఆలస్యమయితే సేఠ్‌తో చివాట్లు.

"దేవుడా! నా సైకిలు నాకు దొరికేలా చూడు, స్వామీ!" అని దణ్ణం పెట్టుకున్నాడు. బజార్లో నడుస్తూ సైకిళ్ళను ఒక కంట కనిపెడుతున్నాడు-ఎక్కడైయినా తన సైకిలు దొరక్కుండా పోతుందా అని ఆశతో.

మరోసారి పోలీసు స్టేషన్‌కి వెళ్ళి ఆరా తీశాడు.

మళ్ళీ కనవడమన్నారు వాళ్ళు.

రాత్రిళ్ళు నిద్రలో సైకిలే కనిపిస్తుంది అతనికి. రెండు నెలలు గడిచాయి. సేఠ్ తిట్లు, ఇంట్లో పోట్లు అధికం అయ్యాయి.

"నీమొహం చూస్తే సైకిలు తిరిగి ఇచ్చేద్దామనుకున్న వాడు కూడా వెనక్కిపోతాడు" అన్నాడు సేఠ్. రోజూ నడిచి తిరుగుతున్న బాధ కన్నా ఆ మాటలే ఎక్కువ బాధించాయి సుబ్రహ్మణ్యాన్ని.



మరోసారి స్టేషన్‌కి వెళ్ళాడు.

"సార్! రెండు నెలలు దాటింది, సార్. సైకిలు పోయిందని కేసుపెట్టి..."అన్నాడో, లేదో గంయ్‌మని లేచాడు పోలీసు రైటరు-

"నీ సైకిలుకోసమే ఈ పోలీస్ స్టేషన్ పెట్టామేటెయ్యా! బుద్ధుందా నీకు? పెద్ద పెద్ద బాంక్ దోపిడీలు, మర్డర్ కేసులే సంవత్సరాల బట్టీ పెండింగున్నా అడిగేవాళ్ళేడు! నీ బోడి సైకిలుకోసం మా ప్రాణాలు తీ సేస్తున్నావ్! దొరికితే మేం కబురెడతాంగానీ, మరెప్పుడూ రాకు. మళ్ళీ కనిపించావంటే బొక్కలో కెళ్తావ్. ఆఁ!" అంటూ గాండ్రించాడు.

బిక్కచచ్చిపోయాడు సుబ్రహ్మణ్యం అవమానభారంతో. ఇక సైకిలుమీద ఆశ వదులు కుంటేగానీ మనశ్శాంతి చిక్కదనిపించింది. సాధ్యమైనంతవరకూ సైకిలు విషయం మర్చిపోదా మనుకున్నాడు కానీ, అది అంత తేలికైన విషయంగా కనిపించలేదు. ఎవరి సైకిలు చూసినా అతని సైకిలే జ్ఞాపకానికి వచ్చేది. ఎన్నిసార్లు, ఎంతెంత దూరం తనని ఆదరంతో మోసుకెళ్ళింది!

పాపం ఎక్కడుందో, ఏమో! కళ్ళు చెమరోయి అతనికి. 'ఆ మధ్య ఎంత నిర్లక్ష్యంగా చూశాడు తను! ఎండలో, వానలో ఎక్కడవడితే అక్కడ పడేశాడు. వారానికోసారయినా శుభ్రంగా ఆయిలు పెట్టి తుడవాలంటే ఎంత బద్ధకం వేసేది. ఈ సారి అలా అశ్రద్ధ చేయకూడదు కానీ, ఏదీ? మళ్ళీ దొరుకుతుందా? ఏమో!' ఇవీ అతని ఆలోచనలు.

ఓ రోజు షాపు కట్టేసిం తర్వాత రాత్రి పూట నీరసంగా దిక్కులు చూసుకుంటూ నడిచి ఇంటికి వస్తున్నాడు సుబ్రహ్మణ్యం. ఒక హోటలు ముందు నిలబెట్టి ఉన్న సైకిలు చూసి చటుక్కున ఆగిపోయాడు. దగ్గిరగా వెళ్ళి పరీక్షగా చూశాడు. అది అతని సైకిలే! ఏం తేడా లేదు. అదే సీటు! అదే బెల్లు! అనుకుంటూ హాండిల్ మీద ఉండాల్సిన అతని పేరుకోసం కళ్ళల్లో ఒత్తులేసుకుని మరీ చూశాడు. ఎస్.హెచ్. సాంబశివరావు అని ఉంది.

ఒక్కసారిగా ఆశ అడుగంటిపోయింది.

ఆ సైకిలు సాంబ గాడిది. ఇద్దరూ ఒకేసారి, ఒకేషాపులో కొన్నారు.

రెండు హాండిల్సుమీదా పేర్లు కూడా అక్కడే కొట్టించారు.

"ఏరోయ్, సుబ్బూ!" అంటూ దగ్గిరి కొచ్చాడు సాంబశివరావు. సుబ్రహ్మణ్యం కళ్ళల్లో నీళ్ళు చూసి, "ఏమైందిరా? చెప్పు!" అంటూ ఆసక్తిగా అడిగాడు.

అన్ని విషయాలూ పూస గుచ్చినట్లు చెప్పాడు సుబ్రహ్మణ్యం స్నేహితుడికి. అతని కంఠంలో నిరాశా, కళ్ళల్లో దిగులూ చూసి గట్టిగా నవ్వేశాడు సాంబు.

"సైకిలు పోయినందుకే ఇంత ఇదవుతారా ఎవరైనా? నువ్వేం బెంగ పెట్టుకోకు! నీ సైకిలు పోయి రెండు నెలలైందంటున్నావుగా బట్టి, అది చచ్చినా దొరకదు. మరేదైనా సైకిలు కావాలంటే చెప్పు... రెండుమూడు రోజుల్లో పోలీసు స్టేషనునుంచి తెచ్చుకుందాం."

తేలిగ్గా అంటున్న అతన్ని చూసి ఆశ్చర్యపోయాడు సుబ్రహ్మణ్యం. "అదెలారా?"

"అదంతా నీకు అనవసరం. రేపు సాయంత్రం మా ఆఫీసు దగ్గరికి క్లోజింగ్ సమయానికి రా! ఆ తర్వాత ఏం చేయాలో నేను చెవుతాను" అంటూ సమాధానంకోసం చూడకుండా సైకిలెక్కి వెళ్ళిపోయాడు సాంబ.

×× ×× ××

మర్నాడు సరిగ్గా అయిదు గంటలకే సాంబశివరావు ఆఫీసుకి చేరాడు సుబ్రహ్మణ్యం.

"నువ్వు బలే ఇన్సియర్‌విరా, సుబ్బూ!" అంటూ మెచ్చుకోలుగా చూశాడు సాంబ.

"నా సైకిలు విషయం।।।"అంటూ నసిగాడు, గట్టిగా అడిగితే పోలీసు గారిలా కసురుతాడేమోనని భయంతో!

"ఇందాకే మా బామ్మర్దికి ఫోన్ చేసి

'హాయి'గా ఉండాలంటే, జయవర్మా జెట్టీలనే ధరించండి



JAYAVARMA KNITTEARS,
LAKSHMINAGAR 5th St., TIRUPUR-638 602.
PHONE: 22231-23221

JV

JAYAVARMA Jatties



నూతన యవ్వనం పొందండి!

జీవితములో పోగొట్టుకున్న యవ్వనము, నరముల బలమును తిరిగి పొందుటకు ఇతర చికిత్సలవలన ప్రయోజనము పొందక విసుగు చెందినవారు సంపూర్ణ సుఖము పొందుచున్నారు!

భారత ఆయుర్వేద వైద్యములో నిపుణత పొందిన

కవిరాజ్
డా॥ డి. హనుమంతరావు

మహంకాళీవీధి, సికింద్రాబాదు. (GOVT REGD)
సలహా ఫీజు 10॥ రూ. * మందుల ఛార్జీలు ప్రత్యేకం.
సంప్రదించు వేళలు:
ఉదయం 8 నుండి 12 వరకు పగలు 3 నుండి 7 వరకు.
ఆదివారం: ఉదయం 8 నుండి 12 వరకు.

శాస్త్రీయమైన ఆయుర్వేద పద్ధతులతో చికిత్స చేయబడును

విషయం చెప్పాను. వాడు పోలీసు ఆఫీసులో రైటర్. మనిద్దర్నీ తనదగ్గిరికి రమ్మన్నాడు. పద పోదాం" అంటూ సైకిలెక్కాడు. కొంత ఉత్సాహం కదిలింది సుబ్రహ్మణ్యంలో. సైకిలు దొరుకుతుందనే ఆశ మనసులో మెదిలింది.

సాంబ సైకిలుమీద పది నిమిషాల్లో పోలీసు స్టేషనుకి చేరుకున్నారు.

సాంబ బామ్మర్ది కానిస్టేబిల్‌తో కాఫీ తెప్పించాడు. సుబ్రహ్మణ్యం ఆ కానిస్టేబిల్‌ని భయం భయంగా చూస్తూనే కాఫీ తాగాడు. సాంబ మాత్రం చాలా చొరవగా, ధైర్యంగా మాట్లాడేయటం చూసి ముచ్చటేసింది సుబ్రహ్మణ్యానికి.

"దాందేముంది లేరా! మీ ఇద్దరి సైకిళ్ళూ పోయినట్టు కంప్లయింటు టైప్ చేసి ఉంచా ఇందాకే! చెరో ఫారం మీదా సంతకాలు చేసెయ్యండి మరి!" అంటూ రెండు టైప్ చేసిన కాగితాలు డెస్కులోంచి తీసి ముందు పడేశాడు బామ్మర్ది.

సుబ్రహ్మణ్యం తన పేరు మీదున్న కాగితం మీద సంతకంచేస్తూ, మరో దానిమీద సంతకం చేస్తున్న సాంబాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

బామ్మర్ది అన్నాడు మళ్ళీ-"రేపు సాయంత్రం ఓ సారి టౌన్ పోలీసు స్టేషనుకి రండి మీ ఇద్దరూ! నేను అక్కడే ఉంటాను. మీ సైకిళ్ళు తీసుకెళ్దురు గాని! ఏం?"

"అలాగే వస్తాం మరి" అంటూ బయటికి దారి తీశాడు సాంబ. "నమస్కారం, సార్" అని సుబ్రహ్మణ్యం కూడా అతన్ని అనుసరించాడు.


కొంత దూరం నడిచిన తర్వాత గుండె చిక్కబట్టుకుని సుబ్రహ్మణ్యం మెల్లగా అడిగాడు-"ఏరా, సాంబా! నువ్వూ సైకిలు పోయిందని కంప్లయింటు పెట్టావేమిటి? నీ సైకిలు పోలేదు కదరా?" అని.

ఆ ప్రశ్నకి గట్టిగా నవ్వాడు సాంబ! "అదంతేలే, గురూ! పన్లో పని... నీ దెలాగూ పోయిందని కంప్లయింటు ఇస్తున్నాం కదా. దాంతోపాటు మరోటి కూడా తెచ్చేసుకుంటే పోలా! అవసరానికి పనికొస్తుంది. అంతా మన చేతిలో పనేగదా!"

నోటివెంట మాట రాలేదు సుబ్రహ్మణ్యానికి. సైకిలు పోయి తను ఏడుస్తున్నాడు. రోజూ వెయ్యి దేవుళ్ళకు మొక్కుతున్నాడు. తన సైకిలు తనకి దొరుకుతుందని గారంటీ ఏర్పడుతోంది ఇప్పుడిప్పుడే! కాని, సాంబ అన్యాయంగా మరో సైకిలు సంపాదించుకోబోతున్నాడు.

పాపం, ఆ సైకిలు పోగొట్టుకున్న అభాగ్యుడు ఎవరో! ఎంతగా ఏడుస్తున్నాడో? ఇక అతనికి తన సైకిలు దొరకదన్న మాట. ఇలా ఎందరికి అన్యాయం జరుగుతుందో?...అన్నీ ఆలోచనలే.

న్యాయంగా, నీతిగా ప్రవర్తించమని స్నేహితుడికి హితవు చెప్పాలనిపించి నోటిదాకా




వచ్చింది గానీ, మనసులో ఒక మూల ఎవరో తట్టి లేపినట్లనిపించింది.

'అనవసరంగా నీతులు చెప్పి అతనికి కోపం తెప్పించావంటే అతని బుద్ధి మారటం అటుంచి, నీ సైకిలు సంగతి మాత్రం హుళక్కి అని.

తర్వాత రోజుకోసం నిద్రకూడా మాని ఎదురుచూశాడు సుబ్రహ్మణ్యం. రాత్రంతా సైకిళ్ళే కలల్లో. సైకిలు దొరికినట్టు ఒక కల. మళ్ళీ వెంటనే పోయినట్టు మరో కల.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు తెల్లవారేవరకూ!

సైకిలుతోపాటు సాంబ కూడా ఒకటే జ్ఞాపకాల్లోకి రావటం. ఈ లోకంలో నీతికీ, న్యాయానికీ చోటులేదు. హోదా, పలుకుబడి ఉంటే చాలు. లేదా అవి ఉన్న వాళ్ళ ప్రాపకం సంపాదిస్తే చాలు. ఎంత ఏహ్యమైన జీవితాలు అవి?

తర్కించుకున్నాడు మనస్సులోనే!

ఎలాగో సాయంత్రం అయింది.

సాంబశివరావు ఎవరితోనో మాట్లాడుతున్నాడు ఆ సమయంలో. అతను వెళ్ళేవరకూ దూరంగానే నిలబడ్డాడు సుబ్రహ్మణ్యం. సాంబ అన్నాడు తర్వాత:"అతను మా ఆఫీసు ప్యూను. సైకిలోటి కావాలి గురూ గురూ అని చాలా రోజుల్నుంచి. రేపు రావయ్యా అని చెప్పి పంపాను. పద మనం పోదాం-మా బావ ఎదురు చూస్తుంటాడు."

మౌనంగా అతన్ని అనుసరించాడు సుబ్రహ్మణ్యం.

"ఇప్పటిదాకా మీ బామ్మర్దిగారు మీకోసం చూసిచూసి వేరే పనుండి వెళ్ళిపోయారు. ఏవీ మీ కంప్లయింట్లు..." ఇద్దరూ తమ అప్లికేషన్లు తీసిచ్చారు రైటర్‌కి.

అటుగా వచ్చిన హెడ్డు సాంబని చూసి-"ఏం, గురూజీ! మీ సైకిళ్ళు తెగపోతుంటాయే" అని నిగూఢంగా నవ్వి, పక్కనే ఉన్న సుబ్రహ్మణ్యాన్ని ఆశ్చర్యంగా చూస్తూ-"ఏవండోయ్! మీరేనా! బాగ్రౌండ్ ఎవరన్నా ఉన్నారా అంటే లేరన్నా రానాడు..." అన్నాడు కొంత నిష్ఠురంగా.

నవ్వి ఊరుకున్నాడు సుబ్రహ్మణ్యం వినయంగా.

పావుగంట తర్వాత స్టేషన్ వెనక్కి తీసుకెళ్ళాడు ఒక కానిస్టేబుల్. అక్కడ గుట్టలుగా పడున్నాయి సైకిళ్ళు తుక్కుగా. వాటిని చూసి బిక్కచచ్చిపోయాడు సుబ్రహ్మణ్యం.

"అవికాదురా, దేభ్యం! మన టైపు వాళ్ళకి క్వాలిటీ సరుకు వేరే ఉంటుంది. అటు పద" అంటూ మరో షెడ్‌లోకి దారి తీశాడు. అక్కడ దాదాపు పదీ పన్నెండు కొత్త సైకిళ్ళ లాంటివే ఉన్నాయి. అందులో తన సైకిలు ఠీవిగా నిలబడుంటం చూచి ఆశ్చర్యంతో కళ్ళింత చేసుకున్నాడు సుబ్రహ్మణ్యం.

దగ్గరికి వెళ్ళి ఆప్యాయంగా దాన్ని రెండు చేతుల్తో తడిమాడు.

అతని సంతోషానికి అవధుల్లేవు.

పదేళ్ళ క్రితం పోగొట్టుకున్న కన్న బిడ్డని కనుక్కున్న కన్న తల్లిలా ఉంది అతని హృదయంలో అలజడి.

ఆ కళ్ళలో నీళ్ళునిండాయి. అవి ఆనంద బాష్పాలు.

"ఒరే, సాంబా! ఇదిగో... ఇది నా సైకిలేరా! నాదే"...అన్నాడు పట్టలేని ఆనందంతో.

కానిస్టేబులు నవ్వుతూ, "ఎంట్సార్; సైకిలు దొరగ్గానే నవ్వటం పోయి ఏడుస్తున్నారు" అన్నాడు.

ఉలికిపాటుతో కళ్ళు తుడుచుకున్నాడు సుబ్రహ్మణ్యం.

"తీసుకోరా! ఆలోచిస్తావేం?"

సాంబ అదిలింపుతో గబగబా సైకిలు స్టాండు తీసి ఇవతలకు తీశాడు. సీటు మీది దుమ్ము కర్చీఫ్‌తో మృదువుగా తుడిచాడు.

సాంబశివరావు కూడా మరో కొత్తగా ఉన్న సైకిలు తీసుకుని బయటకు నడిచాడు. కానిస్టేబుల్, రైటరు ఇద్దరూ గేటుదాకా వచ్చారు.

సాంబ అడిగాడు- "డబ్బేమైనా ఉందా జేబులో?"-

పాతిక రూపాయలు తీశాడు సుబ్రహ్మణ్యం జేబులోంచి.

రైటరు దాన్ని మధ్యలో అందుకుని, "మరీ అన్యాయం, సార్"-అంటూ లోపలికి వెళ్ళిపోయాడు. సాంబ తన జేబులోంచి ఓ పది తీసి కానిస్టేబిల్‌కి ఇచ్చాడు. అతనుకూడా లోపలికి వెళ్ళిపోయాడు నవ్వుతూ!

"నీ సైకిలు దొరికింది గదరా! నా స్నేహితుడివి కాబట్టి సింపుల్‌గా వదిలేశారు. చాలా ఖర్చవుతుంది మామూలుగా అయితే!"

"చాలా థాంక్సురా!" కళ్ళనిండా కృతజ్ఞత మెరిసింది సుబ్రహ్మణ్యంలో.

"సర్లే! నాకు పనుంది. నువ్వు ఇంటికేగా! తర్వాత కలుద్దాం"అంటూ సైకిలెక్కి రివ్వున వెళ్ళిపోయాడు సాంబశివరావు.

అతన్ని కనుమరుగయ్యేవరకూ చూసి, తన సైకిల్ని మరోసారి తడిమి చూసుకున్నాడు. పెడల్ మీద కాలేసి సీటుమీద కెక్కాడు సుబ్రహ్మణ్యం. రెక్కల గుర్రం మీద ఆకాశంలో విహరిస్తున్న అనుభూతి నిండింది అతని అణువణువులో! ●